సుందరి సుబ్బారావు

ఆ వీధిలో నాలుగో ఇల్లు అత్యంత ఆకర్షణీయంగా వుంది. కాంపౌండులో గులాబీ, మల్లె, జాజి మున్నగు పూలమొక్కలు తమ సౌరభాన్ని నలుదిశలా విరజిమ్ము తున్నాయి.

గేటు తెరుచుకుని లోపలకెళ్లి కాలింగ్ బెల్ నొక్కాడు సుబ్బారావు.

మరుక్షణం అరవై ఏళ్ళ వృద్ధుడొకడు బయట కొచ్చి ఎవరు కావాలన్నట్లుగా చూసాడు కళ్ళద్దాలలోంచి.

"అద్దెకు గదులేవైనా..." నసిగాడు సుబ్బారావు.

"ఎవరికి?" అవతల వ్యక్తి ప్రశ్న.

"నాకే"

"నీకు పెళ్ళైందా?"

ఆ ముసలాయన ప్రశ్నకు జవాబివ్వడానికో క్షణం తటపటాయించాడు సుబ్బారావు. ఇంత వరకు తనకు పెళ్ళి కాలేదన్న డిస్ క్వాలిఫికేసన్ వల్లే ఎక్కడా రూము దొరకలేదు. ఉద్యోగం దొరికిందన్న ఆనందంలో ఉరకలు వేసుకుంటూ వచ్చాడీవూరు. అదేనా మామూలు ఉద్యోగమేమీకాదు, బ్యాంకులో పని. పదహారువందలు జీతం. ఇహ చేతినిండా సొమ్మే. సినిమా కెళతానని అమ్మని డబ్బులడగఖర్లేదు. నాన్న పండుగకు పాలిష్టరు షర్టు తీస్తాడో లేదో నని బెంగపడనవసరం లేదు. ఫ్రెండ్సుతో పిక్‌నిక్‌లకు, పార్టీలకు అడ్డు వుండదు. భావి జీవితమంతా వడ్డించిన విస్తరే... ఇలా ఎన్నో కలలు గన్న సుబ్బారావుకి ఉండటానికి చిన్న గది కూడా దొరకక పోయేసరికి అతడి ఉత్సాహం నీళ్ళు కారిపోయింది. తనకు పెళ్ళైతే గాని

ఎవరూ ఇల్లు ఇచ్చేటట్లు లేదు. ఇప్పటికిప్పుడు ఎవరి మెడలో తాళి కట్టడం?.. తన బాధ ఈ జనాని కెలా తెలుస్తుంది?....

"బేచులర్ కైతే గది అద్దెకివ్వరా?" సూటిగా అడిగాడు ఉన్న ఆశ వదలుకుంటూ.

"ఎందుకివ్వం? ఊరికే మాట వరసకడిగాను." అంటూ లోపలకు రమ్మనమని మేడ మీద వున్న గది చూపించాడు.

రూము విశాలంగా ఎంతో బాగుంది.

"అద్దె ఏమాత్రం వుంటుంది"? నమ్రతగా అడిగాడు సుబ్బారావు వచ్చిన అవకాశం ఎక్కడ చేజారి పోతుందో నన్న బెంగతో.

"మంచి వాళ్ళ కెవరికైనా ఆ గదిస్తే మాకు కాస్త సహాయంగా వుంటారని తప్ప అద్దెకోసం కాదు నాయనా. ఈ ఇంట్లో వుండేది నేనూ, మా ఆవిడే. కొడుకు లిద్దరూ ఉద్యోగ నిమిత్తం సుదూరంగా వెళ్ళిపోయారు".

ఆశ్చర్య పోయాడు సుబ్బారావు. ఈ కాలంలో కూడా ఇంత అమాయ కులున్నారా' అనిపించింది. ఆ ముసలాయన మంచి తనానికి లోలోపలే జోహార్లర్పించాడు. కాస్త ఆలశ్యంగా దొరికినా మంచిల్లే దొరికిందనుకున్నాడు.

రెండు వందలిచ్చినా ఇలాంటి పట్నాల్లో ఇంత మంచి రూము దొరకదు. అలాంటిది తనకు తోచినంత ఇమ్మని ఆ ఇంటి యజమాని అనడంతో ఉన్న పళంగా లాడ్జిలో వున్న తన పెట్టె, బెడ్డింగు తెచ్చుకుని దిగాడు సుబ్బారావు.

ఉదయం లేస్తూనే నోట్లో బ్రష్ పెట్టుకుని, భుజం మీద తువ్వాలేసుకుని లుంగీతో మేడ మెట్లు దిగుతున్న సుబ్బారావు వాకిట్లో పంపు దగ్గర అందమైన అమ్మాయిని చూచి ఆగిపోయాడు.

ఆమెకు పద్దెనిమిదేండ్లు వుంటాయి. గుండ్రటి ముఖం, ఎర్రటి శరీర ఛాయ, ఇంతలేసి కళ్ళు పిరుదుల వరకు వ్రేలాడుతున్న నల్లని వత్తైన జడ, తన వంటి ఛాయతో పోటీ పడుతున్న ఎర్రటి వాయిల్ చీర, పిడికిట్లో ఇమిడి పోయేటంతటి సన్నని నడుము, ఎత్తైన వక్షస్థలం. ఏ అవయవానికా అవయవం పొందికగా చిత్రకారుడు తీర్చిదిద్దిన చిత్రంలాగుంది.

చీర చెంగు బొడ్లో దోపుకుని, బిందె చంక నెత్తుకుని హంసగమనంతో ప్రక్కింట్లో కెళ్ళిపోయింది. తను వుంటున్న ఇంటి దొడ్లోంచి వాళ్ళింటికి చిన్న గేటుంది. రోజూ మంచినీళ్ళు పట్టుకోవడానికి వస్తుంది కాబోలనుకున్నాడు.

బ్రష్ చెయ్యడం పూర్తిచేసి స్నానానికుపక్ర మించాడు సుబ్బారావు. ఇప్పుడతని

మనస్సంతా గజిబిజిగా తయ్యారైంది. తనింత వరకు అటువంటి అందాన్ని ఎక్కడా చూడలేదు. ఆ ముగ్ధమోహన సౌందర్యరాశి పొందుకోసం పరితపించ సాగిందతని మనసు.

ఆ రాత్రి హొటల్లో భోంచేసి, రూము కొచ్చి పడుకున్నాడన్న మాటే గాని నిద్రమాత్రం రావడం లేదు. అతడి ఆలోచనలు ఉదయం కుళాయి దగ్గర చూసిన అమ్మాయి చుట్టూ పరిభ్రమించ సాగాయి. ఎలాగైనా సరే ఆమెను పరిచయం చేసుకోవాలి. క్రమేపీ పరిచయాన్ని ప్రణయంగా మార్చుకోవాలి. పెళ్లి చేసుకుని కనరాని లోకాల్లో విహరించాలి..... ఇలా ఎన్నో పగటి కలలు కంటున్న సుబ్బారావుకి ఎప్పుడో మగతగా నిద్ర పట్టింది. భళ్ళున తెల్లారే సరికి మెలకువ వచ్చింది.

మేడమీంచి క్రిందకి చూసాడు. కుళాయి దగ్గర ఆమె లేదు. చివుక్కు మన్న దతడి హృదయం. ఆమె రాకకోసం గుడ్లప్పగించి చూస్తూ నిలబడ్డాడు. తలంటుకుని జడవదులుగా వేసుకుని ముచ్చటైన ముదురు ఎరువు రంగు గులాబీ పువ్వును తలలో తురుముకుని వయ్యారంగా వస్తూ వుంటే ఆమె కట్టుకున్న నీలంరంగు కంచి పట్టుచీర కుచ్చిళ్ళు అటు ఇటు నృత్యం చేస్తున్నాయి.

సుబ్బారావు ఎదలో కోటి దీపాలు వెలిగాయి. ఆమె అందాన్నంతా ఒకేసారి జుర్రుకోవాలన్నంత ఆశగా ఆతృతగా చూసాడు.

ఆమె అతడిని గమనించినట్లు లేదు. తన పనేమో తను చేసుకుపోతోంది. చిన్న పొడి దగ్గు దగ్గి ఆమె దృష్టిని తనవైపు మళ్ళించుకుంటే బావుండునేమోనని పించింది. అంతలోనే తన ఆలోచన తనకే ఎబ్బెట్టుగా తోచింది. అలా చేస్తే తనను తక్కువగా అంచనా వేయవచ్చు. తనపై హేయ భావం కలగవచ్చు అంతేకాదు కాలేజీ కుర్ర చేష్టలు ఇక్కడ చేస్తే తన వునికికే భంగం వాటిల్లే ప్రమాదముంది. ఇలా పరిపరి విధాలు ఆలోచిస్తూ వుండగానే నిండిన బిందెను చంకనెత్తుకుని వెళ్ళి పోయిందామె. శూన్యమై పోయిందతడి మనసు. వెయ్యి వోల్టుల విద్యుత్ కాంతి నుండి సడన్‌గా గాఢాంధకారంలో కడుగు బెట్టినట్లైంది.

మరో రోజు....

ఆ అందాల అపరంజి నీళ్లు పట్టుకుంటూ వుండగా దగ్గర కెళ్ళాడు సుబ్బారావు. అతడిని చూడడంతోనే బిందె తియ్య బోయిందామె.

"తొందర లేదు. మీ బిందె నిండనివ్వండి. తర్వాత నా బకెట్టు పట్టుకుంటాను" అన్నాడెంతో బుద్ధిమంతుడిలా.

చిరునవ్వు నవ్విందామె. ఆ నవ్వులో ఎన్ని అందాలు చూసాడో తనకే తెలీదు.

"నాపేరు సుబ్బారావు ఆపైన కనిపించే గదిలో వుంటున్నాను. ఈ వూళ్ళో నాకుద్యోగమైంది" ఆమె అడక్కుండాను చెప్పుకు పోతున్నాడు సుబ్బారావు.

అతడి మాటలకు మళ్ళీచిరునవ్వే సమాధానమైంది.

"మరి మీ గురించి ఏమీ చెప్పారు కాదు" అన్నాడు సుబ్బారావు కాస్త నిష్ఠూరంగా.

"నాపేరు సుందరి. ఈ ప్రక్కింట్లో వుంటున్నాం. మాకు కుళాయి లేదు. రోజూ మంచి నీళ్ళు పట్టుకో డానికిక్కడ కొస్తూ వుంటాను" అన్నదామె ఎంతో ఫ్రీగా.

ఆమె స్వరం వీణ మీటినట్లుగా వుంది. మాటలను బట్టి ఆమె అంతో ఇంతో చదువు కున్నట్లుగా కనిపిస్తోంది.

చదువు చక్కదనం, సభ్యత సంస్కారంతో మూర్తీభవించిన ఆ పుత్తడి బొమ్మ తన కర్ధాంగైతే అంతకన్నా అదృష్టం మరొకటుంటుందా?.. నిలబడే కలలు గంటున్నాడు సుబ్బారావు.

నిండిన బిందెను చంకనెత్తుకుని 'వస్తానండి' అన్నదామె.

ఆమె మాటలకు హఠాత్తుగా ఆలోచనల నుండి తేరుకుని "మంచిది" అన్నాడు ఆమె వెళ్ళినవైపే కన్నార్పకుండా చూస్తూ.

మరుసటి రోజు దుయం లేస్తూనే ఆమెకోసం ఎదురు చూసాడు. కాని సుందరి ఆరోజు ఎందుచేతో రాలేదు. ఆ రోజేకాదు వరుసగా నాలుగు రోజులు ఆమె నీళ్ళు పట్టుకునేందుకు రాకపోయే సరికి అతడి మనసంతా వికలమై పోయింది.

బ్యాంకులో పని చేస్తున్నా మనసు మాత్రం స్వాధీనంలో లేదు. అనుక్షణం సుందరి గురించే ఆలోచన. సుందరి నాలుగు రోజులై నీళ్ళకెందుకు రావడం లేదు? ఆమె పట్ల తను తీసుకున్న చనువు ఆమెను బాధించిందా? తన ప్రేమ వన్వే ట్రాఫికైతే ఏం ప్రయోజనం?... ఇలా ఎన్నో రకాల ఆలోచనలు అతడి మెదడులో సుళ్ళు తిరుగుతున్నాయి. పరధ్యానంగా వుండడం వలన ఆఫీసు పనిలో పొరపాట్లు దొర్లుతున్నాయి. ఆవేళ మరి పని చేయలేక బ్రాంచి మేనేజర్ని కలిసి మధ్యాహ్నం శలవు పెట్టేసి రూము కెళ్ళి పడుకున్నాడు.

"సుబ్బారావుగారూ!" తలుపు తట్టిన శబ్దం ఆ గొంతుక ఎక్కడో విన్నట్లనిపించి

గభీలుమని లేచి గడియ తీసాడు.

ఎదురుగా అరమోడ్పు కన్నులతో సుందరి. అమితాశ్చర్య పోయాడు సుబ్బారావు. సుందరి తన కోసం గదికి... ఇది కలా?.. నిజమా?.. ఒకమారు తన శరీరాన్ని గిల్లుకుని పరీక్షించుకున్నాడు. స్వప్నం కాదు. వాస్తవమేనని నిర్ధారణ చేసుకుని లోపల కాహ్వానించాడు.

"మీరీ సమయంలో వుంటారో వుండరో నని సందేహిస్తూ వచ్చాను" అందామె. సుందరి మాటల్లో అస్పష్టమైన ఆవేదన వుంది.

"ఈ రోజు కాస్త తలనొప్పిగా వుంటే ఆఫ్ డే లీవ్ పెట్టి వచ్చేసాను. అలా నిలుచుండి పోయారు కూర్చోండి...." మడత కుర్చీ వాల్చాడు.

"ఫరవాలేదు. గత నాలుగు రోజులుగా మా అమ్మగారికి అస్వస్థతగా వుంది. జ్వరంలో ఇప్పుడామె ఏవేవో కలవరిస్తోంది. నాకు భయం వేసి ఇలా వచ్చాను. ప్లీజ్ డాక్టరు గారి నెవరినైనా"...

మరి ఆమె నోటి నుండి మాటలు రావడం లేదు. ఆమె నయనాలు శ్రావణ మేఘాలయ్యాయి.

"మీరేమీ కంగారు పడకండి ఇప్పుడే వెళ్ళి దగ్గరుండి డాక్టరు గారిని తీసుకొస్తాను" అంటూ స్టాండుకు వ్రేలాడు తున్న ప్యాంటు నందుకున్నాడు.

ఆమె ఇంకా అక్కడే నిలబడి వుండటంతో "మీరు ...." ఏదో అనబోయాడు సుబ్బారావు.

అతడి అవస్థను అర్థం చేసుకుని థేంక్స్ చెప్పి వెళ్ళిపోయింది సుందరి.

పది నిమిషాలలో ఆటోలో వెళ్ళి డాక్టర్ని తీసుకొచ్చాడు.

రోగిని పరీక్షించి ప్రిస్క్రిప్షన్ రాసిచ్చాడు డాక్టరు. సుందరి అతడికి ఫీజివ్వబోతే వద్దని తనే చెల్లించాడు. కృతజ్ఞతగా అతడి కళ్ళల్లోకి చూసింది సుందరి.

డాక్టరు వెళ్ళిపోయాక మరో పది నిమిషాలుండి పేషంటును జాగ్రత్తగా చూసుకోమని చెప్పి రూముకొచ్చాడు సుబ్బారావు.

ఆ రోజు లగాయితూ ఇంచు మించు ప్రతిదినం సుందరి ఇంటికి వెళ్ళడం, ఆమె తల్లిగారి యోగక్షేమాలు కనుక్కోవడం, సుందరికి ధైర్యం చెప్పడం తన దినచర్యల్లో ఒక భాగమై పోయింది.

కొద్ది రోజులకు సుందరి తల్లి శాంతమ్మకు జ్వరం తగ్గుముఖం పట్టింది.

సుబ్బారావు కలుపుగోలు తనానికి, మంచి తనానికి ముగ్ధురాలైంది శాంతమ్మ.

సమయం చూసి సుందరినిని తను పెళ్ళి చేసుకుంటానని శాంతమ్మగారికి చెప్పాలనుకున్నాడు సుబ్బారావు. కాని ఆవిడతో ప్రస్తావన ఎలా ప్రారంభించాలో తెలియక రూములో కూర్చుని రెండు మూడు సార్లు రిహార్సల్సు కూడా వేసుకున్నాడు.

ఆరోజు ఆదివారం. ఇంటి దగ్గరే వున్నాడు సుబ్బారావు. స్నానం చేసి నీటుగా డ్రెస్సయి మేడ మెట్లు దిగుతూ సుందరి ఇంటివైపు చూసాడు. అప్పుడే తెల్లని అంబాసిడర్‌కారొచ్చి వాళ్ళ గుమ్మం ముందాగింది. కార్లోంచి పాతికేళ్ళ యువకుడొకడు దిగాడు. అతనితో పాటు యాభై ఏళ్ళ స్త్రీ కూడా వుంది. 'వాళ్ళెవరై వుంటారబ్బా' క్షణం గట్టిగా ఆలోచించాడు సుబ్బారావు. "బహుశా సుందరికి పెళ్లి చూపులేమో" ఆ ఆలోచనకు అదిరిపడ్డాడు. తనీ విషయంలో ఇంకా జాప్యం చేస్తే ఆ అపరంజి బొమ్మను ఎవరో ఒకరు తన్నుకు పోతారు అనుకుని వడివడిగా అడుగులేస్తూ సుందరి ఇంటి కెళ్ళాడు సుబ్బారావు.

"వచ్చావా బాబూ, నేనే కబురు పెడదామను కుంటున్నాను. సమయాని కొచ్చావు" అన్నది శాంతమ్మ.

ఆమె మాటలు అర్థంగాక వెర్రి చూపులు చూశాడు సుబ్బారావు.

"మా అల్లుడొచ్చాడు. పెళ్ళవుతూనే విదేశం వెళ్ళి పోవడం వలన సుందరిని అత్తవారింటికి పంపలేదు. వాళ్ళీరోజు అమ్మాయిని తీసుకెళ్తామంటున్నారు. నా ఆరోగ్యం గురించి నీకు తెలుసు కదా ఇప్పటికిప్పుడు ఏ ఏర్పాట్లు చేయగలను? కాస్త శ్రమ అనుకోకుండా బజారు కెళ్ళి రెండు కిలోలు స్వీటేదైనా పట్టుకురా బాబు" అంటూ వందరూపాయల కాగితమిచ్చింది శాంతమ్మ.

ఆమె మాటలకు సుబ్బారావు మొఖంలో నెత్తురు చుక్కలేదు. మాటలు రాని మూగవాడిలా వణుకుతున్న చేతులతో నోటందుకున్నాడు యంత్రికంగా.

● *ఆంధ్రసచిత్ర వారపత్రిక మే 22. 1987* ●